గోలకొండ పత్రిక: 3-5-1959

# రాడాయె నా స్వామి

తెల్లవారితే పండుగ. హిందూ సమాజంలో ముఖ్య పండుగల్లో ఒకటి! ఏడాదిపాటు శ్రమించి, చెమట ధారపోసి, చల్లని భూదేవి కరుణ వల్ల ధాన్య సమృద్ధి గలిగి, మహదానం దంతో ఓలలాడే పండుగ.

క్రొత్తగా పెండ్లి అయిన పడుచులు మధుర, మాధుర్య భావాలతో తమ నాధుల రాకకై నిరీక్షిస్తారు. నాధుని చూడందే ఆ కలువకన్నియల మోములు మధుర మనోజ్ఞంగా విప్పా రవు. కన్నియల ముఖపద్మాలు వికసించని యెడల, వారి హృదయాలు ఆనందంతో స్పందించని యెడల సంక్రాంతి అందమేముంది?

చీకటి పడేవరకూ వీధి వాకిట్లో వేచియుంది జయలక్ష్మి. కళ్ళు కాయలు కాచేలా చూచింది భర్త కొరకు. ఎక్కడ చప్పుడైనా ఉలిక్కిపడి, అటే చూచేది ఆశగా. ఆమె ఆశలు నిరాశగా మారటానికి ఎంతో సేపు పట్టేది గాదు. మళ్ళీ నిరుత్సాహముగా నిలబడేది వీధి వంక చూస్తూ!

మంచు సోయగముగా, మెల్లగా క్రిందకి జారుతున్నది. పొలాలలో పగలంతా శ్రమించి, పడుచులు యిళ్ళకు మరలి వస్తున్నారు. దూరాన యెవరో వస్తున్నట్లు గోచరించింది జయ లక్ష్మికి! ఇంట్లోకి పొబోతున్నది ఆగిపోయినది. సందె చీకటిలో అంతగా ఎవరైంది అంతు పట్టలా! అయినా, కాసేపు ఉందాం, యెవరో తెలుస్తుంది అని ఆగింది జయలక్ష్మి!

నల్లని చేతి సంచి వూపుకుంటూ వస్తున్నాడు. లాల్చీ ఖద్దరు ధోవతీ కట్టుకున్నట్లుంది ఆ వ్యక్తి!

ఇంకేం! అచ్చం నాటు పద్ధతి వస్త్ర ధారణ ఫిరాయించారే! ఊహూ! అనుకుంది జయ. అమెలో యేదో అవ్యక్తానందం తారట్లు ఆడింది!

జయ, భర్త అప్పుడప్పుడూ.... అసలు తానెళ్ళి ఎన్నాళ్ళుందక్కడ! రెండు సంక్రాంతి పండుగల క్రితం మధుసూదనరావు, ఆయన మేనమామ, ఇంకో ముత్తయిదువుతో జయను చూడటానికి వచ్చారు. అప్పుడూ యిదే వేషం... ఖద్దరు లాల్చీ, ఖద్దరు ధోవతీ, పైన జరీ అంచు ఖద్దరు ఉత్తరీయ్యం! ఆ వేషములో మధును చూచేసరికి.... ఎంతోసేపు చూడనిస్తేనా! ఏమి ముంచుకుపోయిందోనని అప్పుడే తయారైంది వెధవ సిగ్గు. ఇంకేం చూడగలుగుతుంది జయ. అయినా 'నూరేళ్ళ పంట' అని మనస్సు కూడగట్టుకుని మెల్లగా చూచింది తలెత్తి. అంతే! ఏముంది! మధుని చూసేసరికి.... ఆయన తన్ను అంత దీక్షగా చూస్తుంటే.... ఆ కళ్ళల్లోకి దీక్షగా చూడలేకపోయింది. అదేమిటి, అంత చూస్తారు! తనలో యేమి ఉందని?... ఎందుకో నవ్వు పెదాలపై చిందులు వేసింది! పైగా.... హితైభిలాషులు, ప్రక్కింటివారు, పొరుగింటివారు అంతా వేయి కళ్ళతో తనను చూస్తున్నారని జ్ఞాపకం వచ్చేసరికి మరీ....

ఎవరో పాట పాడమన్నారు!.... ఆ సమయంలో పాట ఎలా పాడగలుగుతారు ఎవరైనా!... అమ్మో నోరు పెగిల్తేనా?! మనస్సులో మధుర భావాలు అంబర వీధిన సంచరిస్తుంటే..... వెంటనే వాస్తవిక లోకంలోకి కాలెట్టి స్వరం సరిచూసుకు గళం పెగల్చి, పాట.... అందు లోనూ ఎదటి వ్యక్తుల హృదయాలను మైమరపించేటట్లుగా..... పాడటం సాధ్యమా?

తానీ సందిగ్ధస్థితిలో ఊగిసలాడుతుంటే.... ఆడపిల్లలు గల తండ్రెవరో, తన అవస్థ అర్థం చేసుకుని "ఆ పాటేం పాడుతుంది? అయినా యింతమందిలోనా?.... తీసుకుపోండి. యింట్లోకి! కావమ్మా.... తీసుకుపో!" అన్నాడు.

గబుక్కున యింట్లోకి పరిగెత్తింది! వంటింట్లోకి పోయి వెనక్కు తిరిగి చూసేసరికి.... ఆడంగులంతా వెంట వస్తున్నారు. 'యిదేమిటీ?' అని అనుకున్నది. తలో ప్రశ్న వేశారు- మనసులోని మర్మం బహిరంగం చేయటానికి!

ఆ తర్వాత తీరిగ్గా తల్లి ప్రశ్నిస్తే..... మూతి మూడు విధాలుగా త్రిప్పి కించిత్ కోపంతో కళ్ళు గిరుక్కున త్రిప్పి, 'అబ్బా.... పోవే!' అనేసింది! అంతకంటే ఏం చెబుతుంది!

తను అంగీకరించినా, హితైభిలాషులెవరో, 'పిల్లాడయితే బాగానే వున్నాడు గానీ.... జోడు పెట్టుకున్నాడు సుమా?' అన్నారు - ఆ మాట వినేసరికి జయ మనస్సెందుకో చలించింది! 'అయితే!.... ఆయన...' గొణుక్కుంది. కానీ తండ్రి వెంకట్రామయ్యగారు 'ఇదిగో అమ్మాయి ఒప్పుకుంది! అంతే! ఆరు నూరైనా నూరు ఆరైనా, ఈ సంబంధం జరగా ల్సిందే! అని అనేశారు! ఆయనకు జయ మీద అంత అవ్యాజ ప్రేమ!

అయ్యో! వెధవ ఆలోచనలు! ఏడీ? ఆ వస్తున్న మనిషి?

"అయితే ఆ వస్తున్నది.... కాదా?"

మెల్లగా యింట్లోకి పోతున్నది. రంగడు పరిగెత్తుకుంటూ యింట్లోకి పోతూ.... "అమ్మా.... శ్యామల వాళ్ళ బావొచ్చాడే...."

అయితే ఆ వచ్చింది మధు కాదన్న మాట!

యిలా పరధ్యానంగా యింట్లోకి పోతున్నది. పంచలో లాంతరు పెట్టటానికని వచ్చిన మహాలక్ష్మమ్మగారు కూతురు అదోలా ఉండటం కనిపెట్టింది! లాంతరు కుర్చీ పీట మీద పెట్టి, "ఏమిటే జయా పండగపూట అదోలాగున్నావు? వంట్లోగాని బావుండలేదా ఏమిటి?' అని ప్రశ్నించింది.

ఆమెకేం తెలుసు, అల్లుడు రాలేదని కూతురు మనసు చిన్నబుచ్చుకున్నదని!

"ఏం లేదు! బాగానే వుంది!....."

'ఏం లేకపోవటమేమిటి?.... చలిగాలిలో తిరగొద్దంటే నా మాట వినవాయె! ఇంకేం.... యిదేం వళ్ళు కొస్త కాక తిరిగినట్లుంది!..... అయ్యో రాత! రారా ఇంట్లోకి, దృష్టి యేమన్నా తగిలిందేమో! ఛా యింట్లోకి, మహాలక్ష్మమ్మగారు కూతురును లాక్కుపోయింది.

'నాకేం లేదే!' అని మొత్తుకున్నా ఆమె వినలేదు.

'ఇదేమిటా! కూతురు కిట్లా అయింది!' అని మహాలక్ష్మమ్మగారి మనసు ఆందోళన చెందటం ప్రారంభించింది.

తల్లి గాభరాకు, జయ ఆశ్చర్యపోయింది. తనకు ఏమీ లేదన్నా నమ్మదేం?

వెంకట్రామయ్యగారు పొలము నుంచి కూరల సంచితో వచ్చారు.

భార్య హంగామా చూచేసిరకి ఆయనకు మొదట అనుమానము అవహించింది.

'ఏమిటే! ఏమైందేమిటి?' అన్నట్లు చూశాడు భార్యవేపు.

"పిల్లదానికి వళ్ళు కాక చేసిందండి.... తెల్లవారితే పండగేమిటో.... దీనికిట్లా ముంచుకు రావటమేమిటో...."

"ఉఁ..... యింతకూ మధు రాలేదా ఈ పూటైనా!" అడిగారు వెంకట్రామయ్యగారు ఉత్తరీయము వంకెకు తగిలిస్తూ.

"రాలేదు. వచ్చేవాడయితే ఈ పాటికి రావాల్సింది. రైలు వచ్చి వెళ్ళే పోయింది. శలవు దొరకలేదు కామాలు".

"ముందుగానే మరీ మరీ రమ్మని వ్రాశాను. వస్తానని అతడూ సమాధానమిచ్చాడాయె ఎందుకని రాలేదబ్బా!"

ఆయనకు అర్థం గాలేదు అల్లుడు రాని కారణం! వసారాలో కెళ్ళి మంచం వాల్చుకు కూర్చున్నాడు.

జయ కూడా వసారాలోకి వచ్చింది. వెంకట్రామయ్యగారు, "ఏమిటమ్మా! వంట్లో ఎలాగుందేమిటి?" అని ప్రశ్నించారు.

"ఏమీ లేదు నాన్నా! అమ్మ గాభరా అంతే!"

"రామ్మా, యిట్రా!...." అప్యాయంగా కూతుర్ని పిలిచారు.

జయ వెళ్ళి తండ్రి ప్రక్కన కూర్చుంది.

కాసేపు నిశ్శబ్దం, ఎవ్వరూ మాట్లాడలా.

"అయితే, నాన్నా!... ఆయన ఈ పండుగకు రారేమో?" అన్నది మెల్లగా.

"ఏం? నే మొన్న వెళ్ళినప్పుడు తప్పకుండా వస్తానన్నాడుగా! వస్తాడమ్మా!.... అయితే యింతకూ....."

కూతుర్ని దీక్షగా చూశారు.

"అల్లుడు రాలేదని కాదుగదా నీ బెంగ...."

జయ మాట్లాడలా. నిజమంతే అయినా 'అదేమిటి! మొగుడి కోసం అంత బెంగ?' అని అనుకోరూ!

"పిచ్చి తల్లీ! తప్పక వస్తాడమ్మా ఈ మాత్రానికే బెంగెందుకు?.... సంతోషంగా వుండమ్మా - నువ్వే దిగులుగా వుంటే రంగడు, రాధ మరీ దిగులు పడతారు." మధొస్తాడని గుడ్డలు కూడా తెచ్చా! అతనే కోరి కొనుక్కున్నాడు! రాని వాడయితే గుడ్డలెందుకు కొనిపిస్తాడు?"

జయకు పూర్తిగా నమ్మకం చిక్కలా! ఆయనకు ఎవరింటికన్నా పోవటానికి తగని సిగ్గట! బంధువులింటికే అంతగా వెళ్ళరు!..... అయినా యిది.... నేనుంటినిగా! నా కోసమైనా!.... ఏమో! ప్రతి పండక్కి తప్పక వస్తారని ఎదురు చూడటం! 'పిల్చినప్పుడల్లా అత్తగారింటికెళ్తే అంత గౌరవం ఉండదని' రాడేమో ఆయన!

యిలా ఆలోచనలు చుక్కాని లేని పడవ తీరుగా, యిష్టం వచ్చినట్లు సంచరిస్తున్నయ్!

ఈ గజిబిజి ఆలోచనలతో ఆమెకా రాత్రి అంతగా నిద్రపట్టలా! ఏమిటేమిటో కలలు! వాటి కర్థం లేదు! తీరు అంతకన్నా లేదు! సినిమా రీలులా తెల్లవార్లూ ఒకటే కలలు!

తెల్లవారుఝాముకు కంటికి కాస్త కునుకు పట్టింది. అప్పటికే రంగడు లేచాడు. వెంటనే అక్క దగ్గరకు పరిగెత్తి గబగబా అక్కను ఊపుతూ, "అక్కా! అక్కా బావొచ్చాడే! బావ...." సంతోషంతో బయటికి పరిగెత్తాడు.

ఆమె నిజమా! లేక కలలో మరో ఘట్టమా? అని సందిగ్ధ స్థితిలో కళ్ళు తెరచి చూసింది!

నిజమే రాధిచ్చిన నీళ్ళతో కాళ్ళు గడుక్కుని, రంగడిచ్చిన తుండుతో కాళ్ళు తుడుచుకుని కుర్చీలో కూర్చున్నాడు మధు.

జయ ముఖం గులాబీ పువ్వులా విచ్చుకుంది!

'వచ్చారు!.....'

దుప్పటి విసిరేసి, ఆనందంతో ముఖం తొణికిసలాడుతుండగా దొడ్లోకి పరిగెట్టింది. ఆమె మనసు ఛంగున యెగిరే లేడికూనలా ఆనందంతో ఎగుర సాగింది. దబదబా ముఖం కడిగేసుకుని అద్దం ముందరికెళ్ళి ముంగురులు సరిచేసుకుని కుంకుమ దిద్దుకుంది!

వసారాలో మామా అల్లుడూ ఏవేవో మాట్లాడుకుంటున్నారు!

ఎవరూ లేకుండా కిటికీ దగ్గరకెళ్ళింది జయ! మెల్లగా కిటికీలో గుండా చూసింది మధును. చంద్రుణ్ణి చూసి సాగరంలా ఆమె మనసు..... అనిపించింది!

"అయితే! రాత్రి రాలేదేమోయ్? వస్తావ్ వస్తావని చాలాసేపు ఎదురుచూశాం!.... అమ్మాయి మరీ....."

తన మాట రాంగానే జయ కటిక్కిన నాలిక్కరుచుకుంది! 'ఇదేమిటి నాన్న!..... ఆయనేమన్నా అనుకోరూ?' అని అనుకుంది!

మధు మెల్లగా నవ్వి, "కాస్త పనుండి రాలేకపోయినానండి" అని సమాధానం మిచ్చాడు!

పనుండి రాలేకపోయినారట. అన్నీ దొంగ మాటలు, మంచితనాన్ని మరో విధంగా ప్రదర్శించటం.

మహాలక్ష్మమ్మగారు కాఫీ, ఫలహారాలు తయారు చేసింది. రంగడిని పిలిచి, 'బావ మొహం కడుక్కొన్నాడేమో కనుక్కురమ్మని' పంపింది.

వెంకట్రామయ్యగారు అల్లుణ్ణి "రావోయ్ కాఫీ త్రాగుదాం" అని లేవదీశాడు.

వెంకట్రామయ్యగారు గదిలో అల్లుణ్ణి కూచోబెట్టి, భార్య దగ్గరికెళ్ళి "ఏమే ఏదీ కాఫీ!" అనన్నారు.

"అదిగాదండీ, అబ్బాయి తెల్లవారుఝామున కారు కొచ్చాడుగదా, అవశిష్టాలు తీర్చుకున్నాడో లేదో! అంటే ఏకంగా...."

"ఓసి తెలివి తక్కువదానా! కాఫీకి రమ్మనంగానే లేచి వచ్చాడు. అంటే అర్థం! ముఖం కడుక్కున్నట్టే గదా. ఆఁ! నన్ను తెలివి తక్కువవాణ్ణిగా చూడకు మరి!" అని బుగ్గ గిల్లారు.

"అబ్బ! ఉండండి మరీను! ఎవరన్నా చూస్తారనన్నా లేదు. వయసు మీరుతున్న కొద్దీ, వయ్యారం పెరుగుతున్నదే" అన్నది మహాలక్ష్మమ్మగారు.

తల్లిదండ్రుల సరసానికి జయ నవ్వుకుంది. రాధ వచ్చి "అక్కా అమ్మ రమ్మంటుంది" అంది.

"ఎందుకూ?" అంటూ వెంబడించింది.

తల్లి కాఫీ, పలహారాలు పళ్ళెములో ఉంచి, జయకిచ్చి, "పోయి యిచ్చి రావే?" అని నెట్టింది గది వేపు.

జయకెందుకో భయమేసింది. సంతోషం వచ్చింది మరోవేపు. పోదామని కాసేపు, 'అమ్మో' అని కాసేపు అలా పస్తాయిస్తూ గది ముందర నిలబడ్డది.

"ఏది! మరి మనకు.... పండగ పూట కాస్త నోటి కందించవే!.... అమ్మాయి, అల్లుడు రాలేదని మహా దిగులు పడ్డది! ఆయనగారు రాకపోతే....." ఆయన మాట పూర్తిగాక ముందే మహాలక్ష్మమ్మగారు, కాలే, కాలే ఉప్మా నోట్లోకి నెట్టేసింది. "అబ్బా!" అనన్నారు మెల్లగా.

రాధ, రంగడు కిసుక్కున నవ్వారు.

జయలక్ష్మి గడప దగ్గర తారట్లాడటం చూశాడు మధు. జయ పరిస్థితి చూసి నవ్వుకున్నాడు.

మహాలక్ష్మమ్మగారు కూతురింకా దిక్కులు చూస్తూ నిలబడుండటము గమనించింది!

జయకు మధు దగ్గరికి పోవాలంటే కాళ్ళాడటం లేదు! కళ్ళు కాయలు కాచేలా, ఆయన కోసం నిరీక్షించింది! సాక్షాత్తు ఆయనే వేంచేసి, తన కోసం వేచియుంటే దరిచేరటానికి....

మహాలక్ష్మమ్మగారు "ఎందుకే భయం!....పోక...." అని కూతుర్ని లోపలకు నెట్టేసింది.

తమాషా చూస్తున్న రాధ, రంగడిని లాక్కుపోయింది!

తేలిపోతున్న పాదాలను నిలద్రొక్కుకుంటూ మధు చెంతకెళ్ళి, టేబుల్ మీద పెట్టి, గిరుక్కున వెనక్కు తిరిగింది!

మధు చటుక్కున జడబుచ్చుకు ఆపాడు! 'అమ్మో' అనబోయి ఆపుకుంది జయ!

"అబ్బ! వదలండీ!"

వచ్చిన అవకాశాన్ని, చేజార్చుకునే రకం గాదు, మధు!

జయను పొదివి పట్టుకుని, "వచ్చిందాకా రాలేదా అని, వస్తేనేమో యిట్లాగా...." అన్నాడు మధు.

"ఆ వచ్చార్లే! మహా!... ఇవ్వాళా మరి వచ్చేది?...." అన్నది కోపంగా.

"అందుకా కోపం! ఏం చేయమంటావు చెప్పు? ఆ సీతారామయ్య మూలకంగా ఆలస్యమైంది. లేకపోతే ముందుగానే వచ్చేవాణ్ణి...." అనన్నాడు.

జయకు అర్థంగాలా!

"అదే నీకు నెక్లెసు చేయించాలని అనుకున్నాం గదూ! దాని కోసం సీతారామయ్యను చేయమని చెప్తే అదిగో యిదిగో అని యిన్నాళ్ళూ త్రిప్పాడు. పండగ రోజులు పనులెక్కువగదూ? బలవంతాన 'కాదబ్బాయ్ మా జయ అసలే మంచిది గాదు!' అని పూర్తి చేసేసరికి రాత్రి ప్రొద్దుపోయింది. పండగ గదా తీసుకుపోదాం అనే ఆగాను సుమా! తెల్లవారేసరికి రెక్కలు గట్టుకు రానేవస్తిని! యిహ దాసుని అపరాధాలుంటే...." చిలిపిగా చూశాడు జయ కళ్ళలోకి.

మధును చూసి జయ ఫక్కున నవ్వింది. మధును గురించి పరిపరివిధాల ఆలోచించినందుకు ఆమె నొచ్చుకుంది; మధు పెట్టె తెరచి జయ మెడను అలంకరించాడు!

"ఏదీ యిటు చూడు....ఆ! ఆ! ఏదీ ఒక్క ముద్దు...."

జయ మీదికి వంగాడు!

జయెప్పుడో అతని హృదయాన చేరింది! జయ - మధు సంక్రాంతి శుభసమయాన....

"రాడాయే నా స్వామి...."

కూచిపూడి భాగవతులు గళమెత్తి పాటందుకున్నారు వీధి వాకిట్లో!

కానీ జయ 'స్వామి' ఎప్పుడో వేంచేశాడు! •